అడ్డం తెరలం

‘‘మీరు ఈ ఊళ్లో ఉండబట్టి నాలుగేళ్లయిందా?’’ ఎన్నేళ్లయితేనేం? ఐనా ఈ ప్రశ్న డాక్టరు కెందుకు? ఏదో తోచిన మందు ఇచ్చి ఆవతలికిపోక! నీరసంగా మంచముమీద పడుకొని ఉన్న కాత్యాయని కనుబొమలు ముడివేసుకొని పక్కకు ఒత్తిగిల్లింది.

‘‘మూడేళ్లు కావచ్చింది. అసలు నేను ఉద్యోగానికి వచ్చే మూడేళ్ళయింది. ఈ ఊరే మొదలు___’’

అడిగిన దొకటే ప్రశ్నకాని మూడు ప్రశ్నలకు పనికి వచ్చే జవాబు ఇచ్చాడని కాబోలు కాత్యాయని వెనక్కు మళ్ళి భర్తను అదొక మాదిరిగా చూసింది. కొంతమంది ప్రశ్నలు ఎట్లా ఉంటాయంటే జవాబు చెప్పే వాడికి ‘ఇందులో ఏమున్న’ దనిపించినా వినేవాళ్ళకు ‘చొప్పదంటు ప్రశ్న’ అనిపించినా ప్రశ్నించిన వాళ్ళ మనసులో రాబట్టుకొన్న విషయమంతా రికార్డు చేయబడి, సందర్భము వచ్చినప్పుడు ఋజువుకు ఎనికి వచ్చేటట్టుగా ఉంటుంది.

‘‘నాకు మాత్రము ఈ విశాఖపట్నంలో అక్షరాభ్యాసమయింది. మెడికల్ డిగ్రీ తీసుకోగానే యిక్కడ ఉద్యోగం దొరికింది.’’

‘‘నేను మద్రాసు, పూనా, ఢిల్లీ నగరాలలో చదువు వెలిగించాను. ఢిల్లీలో ఉండగానే సెలెక్షను వచ్చింది. అది కాగానే వెళ్ళి సెలెక్టు అయాను.’’

‘‘అందరితో తూచి తూచి మాట్లాడే ఆయనలో ఇవాళ ఇదో కొత్త మార్పు కాబోలు!’’ ఆమె ఆశ్చర్యపడ్డది. తనకు కలిగిన ఆశ్చర్యాన్ని పైకి కనబడనీయకుండా ఎంత కప్పిపుచ్చినా డాక్టరు ఓరకంటితో కనిపిస్తూనే ఉన్నాడు. అతడిచేత వాగించి ఆమెను గమనిస్తున్నాడు.

"భార్యాభర్తలిద్దరూ ఒక సబ్జక్టు వాళ్ళయితే దాన్ని గురించే వాళ్ళుఎప్పుడూ చర్చించుకుంటూ ఉంటారని మా అన్నయ్య అంటూ ఉంటాడు. మీరు అలాగే అనుకుంటూ ఉంటారా?"

ఈ ప్రశ్నకు ఉమాశంకరం ఏమని జవాబు చెప్తాడో కాత్యాయని ఊహించు కుంది. కాని అతడు ఆమె ఊహను ఖండించినట్టుగా "చర్చించటానికి మనిషి ప్రధానమా-విషయం ప్రధానమా?" అన్నాడు.

"కావలసిన వ్యక్తులతో చర్చించటానికి అభిమానమైన అంశమేమిటని నేనడిగే ప్రశ్న:" డాక్టరు ఈ మాటలంటూనే ఉమాశంకరము మొదట వెలిబుచ్చిన అభిప్రాయాన్ని రికార్డు చేసుకొన్నాడు

"భార్యది కూడ తన సబ్జక్టేనని తెలిసిన తరువాత దానిమీద అభిమానం పోయినా అసహజము కాదు:" కాత్యాయని నోరుజారింది. తరువాత నాలుక కరచుకొన్నది.

డాక్టరు ముఖము ఒక్కసారి తళుక్కున మెరిసింది.

"నా భార్య కూడ డాక్టరయితే బాగుండునని నేను మనసుపడే అవకాశం లేదు సుమా. కాని ఒక్క సంగతి. వైద్యాన్నిగురించి తెలియకపోయినా నాతో అవిడ ఎప్పుడూ మందులను గురించి జబ్బులను గురించి తప్ప మరొకటి మాట్లాడదు." డాక్టరు మాట్లాడుతూ వాళ్ళ ముఖాలను చూడటం మొదలుపెట్టాడు.

"ఆమె ఏ యూనివర్సిటీలో ప్యాసయింది?" కాత్యాయని కుతూహలంతో ప్రశ్నించింది.

దానికి జవాబుగా డాక్టరు ఇల్లెగిరి పోయేటట్టు నవ్వాడు. "ఆమెకు డిగ్రీలు ఉన్నాయనా మీరనుకోవటం?"

"అందుకే.... అందుకే...." కాత్యాయని మాటపూర్తిచేయకముందే నౌకరు పిల్లవాడిని తీసుకువచ్చాడు. ఉమాశంకరం నాలుగడుగులు ముందుకు వేసి ఆప్యా యంగా పిల్లవాడి నందుకున్నాడు.

కాత్యాయని ముఖం ఎర్రబడ్డది. గోడవైపు తిరిగి దీర్ఘంగా ఊపిరివిడిచింది.

ఆరునెలలనుండీ డాక్టరు కాత్యాయనికి మందు వాడుతున్నాడు. దేహములో అశక్తత తప్ప మరేమీ కనబడదు. ఎన్నిరకాల మందులూ టానిక్కులూ వాడినా అశక్తత తగ్గటం లేదు. ఆరోగ్యస్థితి ఆరు నెలలనాడు ఎట్లా ఉన్నదో అంతే. మంచం మీదనుంచి దిగి తనకై తాను పది అడుగులు వెయ్యలేదు. లేస్తే గుండె దడదడలాడిపోతున్నది. కాళ్లూ చేతులూ వణికిపోతున్నాయి.

ఒక వారంరోజులనుండీ డాక్టరు ఆమెను మందులతో బాధించటం లేదు. రోజూ సాయంకాలం ఒక అరగంటసేపు కులాసాగా కబుర్లు చెప్పి ఇంటికి వెళ్లు తున్నాడు.

ఫిబ్రవరినెల మూడవవారము - రాత్రిళ్లు చలి-పగటిపూట ఎండ. ఒకనాడు డాక్టరు కాత్యాయని యింటికి రాలేకపోయాడు. ఆనాడంతా కాత్యాయని గోడవైపు తిరిగి మంచముమీద పడుకునే ఉంది. ఉమాశంకరం వాకిటి వరెండాలో సాయం త్రంకాగానే పుస్తకం చేతపట్టాడు.

మరునాడు మామూలువేళకే డాక్టరు వచ్చాడు. ఉమాశంకరం ఆయనను చూడగానే వాకిటిముందుర నైట్‌క్వీను చెట్లదగ్గర నీళ్లుచల్లించి కుర్చీలు వేయిం చాడు. ఓపిక చేసుకుని కాత్యాయని కూడా లేచి కుర్చీలో కూర్చుంది.

క్రిందటిదినము ఆయన ఎందుకు రాలేదో అడగాలని కాత్యాయనిమనసు ఉబలాటపడింది. కాని అభిమానం అడ్డుపడ్డది. ఇద్దరూ డాక్టరు చెప్తాడేమో అన్నట్టు చూస్తున్నారు.

రోటరీక్లబ్బులో సంయుక్తరాష్ట్ర సమాచారశాఖవారి చిత్రప్రదర్శనం చూసి వచ్చానని డాక్టరు చెప్పాడు. కోటు విప్పి చేతిమీద వేసుకుని, చూసి వచ్చిన సూర్యాస్తమయశోభను వర్ణించటం మొదలుపెట్టాడు.

ఉమాశంకరానికి చప్పున ఏదో జ్ఞాపకం వచ్చినట్లయి "మేమూ చూశాము. ఒకసారి" అన్నాడు.

కాత్యాయని పెదవులు వాటంతట అవే విరుచుకున్నాయి. మూడేళ్లనాడు చూసిన చిత్రప్రదర్శన విశేషాలు నిన్నా మొన్నా చూసివచ్చినట్టు ఉమాశంకరం వర్ణిస్తుంటే డాక్టరు వింటూ వింటూ మధ్య కాత్యాయని ముఖాన్ని క్రీగంట చూస్తు

న్నాడు. కాత్యాయనికి ఆనాడు చిత్రప్రదర్శనానికి వెళ్లిన వైనం స్మృతి పథాన మెరుపులా మెరిసింది.

కాత్యాయని తలనిండా విరజాజులు పెట్టుకుని కనకాంబరం చుక్కల నల్లచీరె కట్టుకొని డాబామీద నిలబడ్డది. పశ్చిమదిశకు చేరుకున్న సూర్యుడు చుట్టూ అలుముకున్న అరుణరాగాలనూ, ఆ వింతసోయగాన్నీ చూస్తూ నిలబడిపోయినది. సూర్యోదయమూ సూర్యాస్తమయమూ ప్రకృతి సిద్ధమయిన దినచర్యలే. కాని-ఏరోజు కారోజు నూత్నశోభలతో కనబడుతూ ఉంటాయి. నిత్యమూ భానుడు బంగారు ఛాయలలోనే మాటు మణిగిపోతాడు. కాని ఆ రంగుల కలయిక, ఆ లేత కిరణాలు, మబ్బులు కమ్మిన ఆ జేవురుకాంతి నిత్యనూతనము. ఆమె అక్కడ నిలబడి ఉండగనే నాలుగిళ్ల అవతల సింగుదంపతులు కిలకిలలాడుతూ సినిమాకు కాబోలు బయలుదేరారు. వాళ్ళు రోడ్డు మలుపు తిరిగేవరకూ చూసి వెనక్కు తిరిగింది. మనస్సు కలతబారినట్లయింది. మెట్లు దిగబోయి తూలిపడ్డది

మూడవనాడు ఉమాశంకరంతో వెళ్ళి ఆ చిత్రప్రదర్శనాన్ని చూసి వచ్చింది. దార్శనికతలో వారు చూపిన పరిపూర్ణత ఆమె కెంతో విస్మయాన్ని కలిగించింది. ఆమె కెంతో ఆత్మానందం కలిగింది. అయినా ఎంత వరపడితో ప్రవహించినా నదీగర్భంలోని ఒక చిన్నగుట్టను కమ్ముకోలేకపోతున్న దా ప్రవాహము. ఆమె మనసు పొంగులువారుతూ ఒడ్డు లొరుసుకుంటూ ప్రవహించే నదిమీదికి పోయేది కాదు. కాని గుట్టశిఖరాన్ని అందుకోలేని ఆ నది పొంగూ దాని ఉత్తుంగతరంగాల మధ్య చంద్రుడిలో మచ్చలా ఆ నల్లటి గుట్టా ఆమెకు మరువని స్మృతులు.

కాత్యాయని వెచ్చటి నిట్టూర్పు విడిచి ముఖాన్ని దించుకుంది.

'నేను చెప్పేది మీకు నచ్చినట్టు లేదు' తల పంకిస్తూ కాలూపుతూ అన్నాడు డాక్టరు.

కాత్యాయని ఒకసారి కళ్లెత్తి కిందికి వాల్చింది. డాక్టరుతో పరిచయమయి నప్పటి నుండీ కాత్యాయని హృదయం మరింత దిగజారిపోతున్నది. ఉమాశంక రానికి అతడిని చూడగానే పంచప్రాణాలూ లేచి వచ్చేవి. ఆమె ముందరే ఇద్దరూ కబుర్లలో పడి గడియారాన్ని చూసేవారుకారు. కాత్యాయనికక్కూడా ఆ కబుర్లు

వినాలనే కుతూహలంగా ఉండేది. తాను కూడా మాట కలపాలనుకునేది. తాను అరమర లేకుండా అమితోత్సాహంతో కబుర్లు చెబుతున్న ఉమాశంకరాన్ని చూడ గానే ఆమె మనసు కుంచించుకుపోతున్నది. ఏమా ప్రసంగ కౌశలము! తియ్యగా హాయిగా ఇంత బాగా మాట్లాడుతున్నాడు! స్నేహితులు ఒకరిద్దరు ఆయనను పొగడటం ఇదివరలో ఒకసారి విన్నది. ఇందుకే కాబోలు!

మరునాడు మధ్యాహ్నం రెండుగంటలకు డాక్టరుకు కబురువచ్చింది. కాత్యా యనికి తలనొప్పి ఎక్కువగా ఉన్నదని, అప్పటి కేదో మందు పంపి సాయంత్రం వచ్చాడు చూడటానికి.

"మీ తలనొప్పి ఎలా ఉంది?" కుర్చీ దగ్గరగా లాక్కున్నాడు.

"కళ్ళు తెరవలేకుండా ఉన్నాను" బాధతో మూలుగుతూ అన్నది కాత్యాయని.

"తలనొప్పేగా - అదే తగ్గిపోతుంది. ఇవాళ మా స్నేహితు డొకడు ఉత్తరం వ్రాశాడు. బ్రహ్మచారిగా ఉండి ఉండి మొన్ననే పెళ్ళి చేసుకున్నాడట. పద్మా పాపయ్య అని మదరాసులో క్వీన్ మేరీస్ కాలేజీలో చదివిందట. ఆనర్స్. ఫస్టుక్లాస్"

"ఆఁ హా! అయితే ఎప్పుడు చదివి ఉంటుంది?" మెల్లగా పడక మీది నుంచి లేచి కూర్చుంది కాత్యాయని.

ఆరేళ్ళక్రింద ప్యాసయిందట. ఇప్పుడు నెల్లూరు కాలేజీలో లెక్చరరుట."

"నేను చదివేటప్పుడు ఒక్క పద్మాపాపయ్య ఉండేది. నా క్లాస్ మే టన్న మాట."

"అయితే ఆవిడే అయి ఉంటుంది. 'మా ఆవిడ ఫోటో చూడ'మని పంపాడు. ఆ గ్రూపుఫోటోలో మీరు ఉన్నారు."

"నిజంగానా? పరీక్షలముందర తీయించుకున్నాము. అద్భుతమైన తెలివి గలది. అసలు పెళ్లే చేసుకోనంటూ ఉండేది. అయితే ఆయ నేం చదివారు?"

"చదువులో మావాడు ఆమెముందు తీసికట్టే. టీ కంపెనీలో పనిచేస్తు న్నాడు. జీతం భత్యం కలిపి అయిదు వందలు వస్తాయి. ఆమెకు రెండువందలు

ఏభై . కలిసి ఖులాసాగా జీవిస్తున్నారు. ఇక్కడికి సెలవుల్లో వస్తామని వ్రాశాడు. వస్తే మీ యింటికి తీసుకువస్తాలెండి.''

ఉమాశంకరం పిల్లవాడిని ఎత్తుకుని వచ్చాడు. ఆమె ఎదుటనే ఇద్దరూ కబుర్లలో పడ్డారు.

కాత్యాయని మనసు తాను కాపరం పెట్టిన తొలి రోజులమీద వాలింది. ఆమె ఆ ఉదయము కావాలని ఎనిమిది గంటలకు నిద్రలేచింది. ఇల్లంతా ఒక్కసారి కలయదిరిగి ఉమాశంకరం ఆఫీసుగదిలోకి తొంగి చూసింది. కుర్చీలో కూర్చుని పైల్సు తిరగవేస్తున్నాడు. దీర్ఘంగా నిట్టూర్పు విడిచి, కళ్లు మూసుకుని వెనక్కు తిరిగింది. అరగంట సేపటిలో వేడివేడి కాఫీ రెండు గ్లాసులు తెచ్చి బల్లమీద పెట్టింది

పావుగంట తరువాత ఉమాశంకరం లోపలికి వచ్చాడు. మాట్లాడకుండా తన గ్లాసందుకుని తాగి వెనక్కు తిరిగాడు. కాత్యాయనికి కణతలు పగిలిపోతున్నాయి ఉత్సాహమంతా నీరసంగా మారిపోతున్నది. కాళ్ళు ఈడిస్తేనేగాని నడక కుదరటంలేదు. చప్పగా చల్లారిన కాఫీ గుటుక్కున తాగి వంట యింట్లోకి అడుగుపెట్టింది. ఉత్సాహంతో ఉరుకులు పెడుతూ పొంగులువారుతున్న హృదయం ఆరు నెలలకే ఎండి మోడయిపోయింది. దిగులుగా భారంగా క్రుంగిపోయి కుర్చీలో కూర్చుని పోయేది. ఎంతసేపటికీ లేవాలనిపించేది కాదు. పరధ్యానంతో రుచీపచీ తెలుసుకోకుండా నాలుగు మెతుకులు కడుపులో వేసుకుని, మనసు మళ్ళించుకోవటానికి ఎన్ని పుస్తకాలు పుటలు తిరగవేసినా అ చెమట బిందువులు అట్లా అవతరిస్తునే ఉండేవి. డ్రాయింగురూములో కూర్చుని ఉబుసుపోక ఊలో దారమో అల్లుతూ ఉంటే పని తీర్చుకున్న అమ్మలక్కలు ఆమె అదృష్టాన్ని పదేపదే పొగుడుతూ ఉంటే కలువరేకుల్లాంటి కళ్లు మరింత విచ్చుకునేవి ఆశ్చర్యంతో.

అన్నయ్య కొంటె కోణంగి. మనస్సులో ఉన్నమాట పుస్తకం చదివినట్లు చదువుతాడు, సంక్రాంతికి వెళ్ళినప్పుడు ఉమాశంకరం మూడోనాడే ప్రయాణమయ్యాడు. ''మనం వెళ్టాము, బయలుదేరు'' అని ఉమాశంకరం అంటే సంతోషంతో తను కూడా బట్టలు సర్దుకొని బయలుదేరి ఉండేది, మాటవరసకు, నాన్నగారు ''కాత్యాయని కూడా ఇప్పుడే రావాలా?'' అనగానే ఒక్కడే బయలుదేరాడు.

పదిరోజులు ఉన్నదన్న మాటేగాని దిగజారిన మనసుతోనే ఉన్నది. అన్నయ్య చిటికెలో సంగతి గ్రహించాడు. ఆ మరునాడు "మాటా మంచీ లేకుండా ఏమి టీకాఫీ యివ్వటం?" వదినను కేకలేస్తున్నాడు. భోజనాల దగ్గర "ఈ మూగవడ్డన ఏమిటి?" కసురుకుంటున్నాడు రెండు రోజులు అన్నయ్య ధోరణి చూచేసరికి తనకు హృదయం బరువెక్కినట్లయింది. మాట్లాడితే కళ్ళ నీళ్ళు కారే పరిస్థితికి వచ్చింది.

"ఇది యంత్రం కాదు కమలా? మానవ జీవితం. ఒకమాటతో ఎదటివాడి మనసు పొంగాలి. నీరు కారిపోకూడదు. కలిపి బతకాలంటే మాట కలుపుకోవాలి" వదినెకు రోషం వచ్చి మూతి మూడువంకర్లు తిప్పుకుంటూ లోపలికి వెళ్ళింది. తన వ్యథకొక రూపమిచ్చి వ్యక్తం చేశాడు అన్నయ్య. తన సంగతి గ్రహించి తన నేడిపించటానికి పూనుకున్నాడు.

ఉదయం లేవగానే అన్నయ్య గదిలోంచి "కమలా! ఇనాళ్ళయింది కదా నీవు వచ్చి! యాంత్రిక జీవితమే కాని సరదాగా ఇది కావాలని అడగవు. ఎక్కడి కయినా వెళ్దాము రమ్మనవు, ఏమిటి నీ మనస్సులో ఏముంది చెప్పు?" నొక్కి నొక్కి అడుగుతున్నాడు.

"నే నడక్కపోతే ఏమండీ. మీరు రమ్మనగానే వస్తున్నాగా" సన్నగా వదిన మాటలు.

"అదా! అయినా నీవు అడగటము. నేను తీసుకు వెళ్ళటము దానిలో ఎంత సంతోషం ఉంటుందో ఊహించవేం? గంగిరెద్దులా అన్నిటికీ తల ఊపుతావా?"

వదిన మాట్లాడలేదు. కొందరికి అడగటం ఇష్టం. కొందరికి అడిగించు కోవటం ఇష్టం. కొందరికి ఎదటి వారు తమదగ్గర చనువుగా, కులాసాగా ఉండటం ఇష్టం. కొందరికి తమతో ఎవరూ చనువుగా ఉండటం ఇష్టంలేదు. అన్నయ్య మాటలు సరిహాసానికి కాక నిజమయితే........ఆయన కెంత బాధో? మరి తనకు? అన్నయ్య ఎత్తి పొడవటం లేదుకదా!

ఈ పదిరోజులలో కాత్యాయనిలో మార్పు అంతగా కనబడలేదు. బలకర మయిన ఆహారం బలవంతంగా డాక్టరు దగ్గర ఉండి పెట్టిస్తున్నాడు.

సాయంత్రం అయిదుగంటలకు టెలిగ్రాము వచ్చింది. ఆయన స్నేహితుడు భార్యతోసహా అక్కడికి వస్తున్నట్లుగా డాక్టరు స్టేషనుకు వెళ్ళి ఇద్దరినీ కారులో తీసుకువచ్చాడు.

పద్మా పాపయ్య మనిషి ఒడ్డూ పొడుగు-తీవిగా ఉంటుంది. అతడు ఆమె ముందర చాలా పీలగా కనబడతాడు, పద్మను చూడగానే లేచి కౌగలించుకుంది కాత్యాయని

"కానీ! ఏమి టిలా ఉన్నావు? ఏం జబ్బు చేసింది? నీ ఉత్సాహమంతా ఏమయింది? డాక్టరుగారు చెప్పేవరకూ నీ విక్కడ ఉన్నట్టు తెలియదు సుమా!" పద్మ కాత్యాయిని మంచమ్మీద కూర్చుని ఆవేదనతో పలకరించేసరికి కాత్యాయనికి దుఃఖం పొంగుకుంటూ వచ్చింది.

డాక్టరు, పద్మభర్త వసంతరావు ఆ గదిలోకి వచ్చారు. మరొక కుర్చీ తీసుకుని వాళ్ళవెనక ఉమాశంకరం వచ్చాడు. పరస్పరాభివాదాలు అయిన తరువాత "ఈమేకదూ నీవు పంపిన ఫొటోలో ఉన్నది?" వసంతరావు మెల్లగా పద్మ చెవి దగ్గరగా ముఖంపెట్టి అడిగాడు.

అవును. అప్పుడు ఎలా ఉండేదనుకున్నారు? మనిషి బంతిలా ఉండేది ఎంతో ఉత్సాహంగా ఎగురుతూ ఉండేది హాస్టల్లోకల్లా సరదా గల పిల్ల కాత్యాయనే. ఏమిటో ఇప్పు డిలా అయిపోయింది"

పిల్లవాడు తప్పటడుగులు వేస్తూ, తల్లిదగ్గరికి వచ్చాడు. అందరూ తలా కొంచెముసేపు ఎత్తుకొని, ముద్దుపెట్టుకున్నారు వసంతరావు ప్యాంటు జేబులోంచి బిస్కట్లు పొట్లము తీసి పిల్లవాడి చేతిలో పెట్టాడు. పొట్లం చింపి ఒకటి తాను తిని రెండవది తల్లి నోట్లో పెట్టపోయాడు.

"నాకు వద్దమ్మా, ఈ ఆంటీకి పెట్టు." కాత్యాయని పిల్లవాడిని బలవంతం చేసి పద్మకు ఒక బిస్కట్టు యిప్పించింది. పద్మ పిల్లవాడిని ఎత్తుకుని ముద్దుపెట్టుకుంది. మగవాళ్లు ఏవో కబుర్లు చెప్పుకుంటూ నవ్వుకుంటున్నారు. అందరిలో ఉమాశంకరం గొంతే బాగా వినబడుతుంది.

నౌకరు కాఫీ తెచ్చి అందరికీ యిచ్చాడు. ఉమాశంకరం వక్కపొడి డబ్బా అందించాడు.

మా చెల్లెలు నా కంటే ముందు పెళ్ళి చేసుకుంది కాచీ దానికొక కొడుకు పుట్టాడు చూడటానికి రమ్మని వ్రాసింది. తెల్లవారుఝామున బయలుదేరే బండిలో వెళ్ళిపోతాము. అవునుగాని కాచీ నీవు మా ఇంటికి వచ్చి రెండురోజులు ఉండవూ ?'' కాత్యాయని చేతిని తన చేతుల్లోకి తీసుకుంటూ అడిగింది పద్మ.

"చూద్దాంలే" అంది నీరసంగా కాత్యాయని.

''ఏమండీ మా కాచిని మా యింటికి ఒక్కసారి పంపండి. రెండురోజులు ఉండివస్తుంది'' ఉమాశంకరాన్ని అడిగింది పద్మ.

మౌనంగా తల ఊపాడు ఉమాశంకరం పద్మా వసంతరావులు లేచారు. వాళ్ళ వెంబడి డాక్టరు కూడా లేచాడు.

ఒక నిట్టూర్పు విడిచి గోడవైపుకు తిరిగి పడుకుంది కాత్యాయని.

మరునాడు లానులో కూర్చుని కబుర్లలోపడ్డారు ఉమాశంకరం - డాక్టరు.

''నాకు ఆనర్సులో సీటు రాలేదండీ, అందుకే అటు తిరిగి యిటు తిరిగి ఎలాగో బి ఎ ముగించి 'లా' చదివాను. ఈ యల్.బి.సి. లో ఉద్యోగం దొరికితే చేస్తున్నా గాని ఆనర్సులో సీటు రాలేదన్న కించ ఇంకా పోలేదు" ఉమాశంకరం చెప్పుకుంటూ పోతున్నాడు.

కబుర్లు వింటూ డాక్టరు నాలుగు సిగరెట్లు కాలుస్తూ తల ఊపుతున్నాడు.

''అంతే కాదు, ఆనర్సులో సీటు వచ్చిన వాళ్ళను చూస్తే నాకెట్లాగో ఉంటుంది. సరిగ్గా మాట్లాడలేను ''

డాక్టరు చివాలునలేచాడు. మంచినీళ్ళు తెప్పించుకుని తాగాడు. ''ఇవాళ ఏం తోచటంలేదు. మా ఆవిడ సినిమాకు వెళ్దామని టికెట్లు తెప్పించింది. మీరు కూడా రావాలి.''

''అబ్బే. మీరు వెళ్ళండి, నేను యింకోసారి వస్తాను'' ఉమాశంకరం ఎంత తప్పించుకోజూచినా డాక్టరు విడిచిపెట్టలేదు.

తనకంటె అన్ని విషయాలలోనూ పై స్థాయిలో ఉండేవాడే పురుషుడిని స్త్రీ ప్రేమించ గలుగుతుంది. లేకపోతే లోకువగా చూస్తుంది. అని కథా నాయ

కుడు స్త్రీలకు దూరంగా ఉంటాడు. ధైర్యంగా ఎవరితోనూ మాట్లాడలేడు. కొద్దిగా చదువుకున్న అతడు పల్లెటూరి వాతావరణంలో ధైర్యంగా మెలగగలుగుతాడు. ఆ పల్లెటూరు చూడటానికి వచ్చిన ఒక చదువుకున్న అమ్మాయి అతడు వెనుకడుగు వేస్తున్నా వెంటపడి అతనిలో ఉన్న భయాలన్నిటిని వదలగొట్టి,గాఢంగా ప్రేమించి పెళ్లిచేసుకోమంటుంది. చదువుకున్న ఆడపిల్లలను చూస్తే తలుపులు బంధించు కొని గదిలో కూర్చునే కథానాయకుడు తన సందేహాలు తీర్చుకొని ఆమెను వివాహమాడతాడు. ఇద్దరూ చాలా సుఖంగా జీవిస్తారు.

డాక్టరుకుగాని ఉమాశంకరానికి గాని ప్రతి మాటా అర్థమయేటంత హిందీ రాదు. సినిమా కథ పుస్తకం చదివి తెలుసుకున్నారు. కథంతా స్థూలంగా అర్థమయింది

డాక్టరు తన డిస్పెన్సరీలో శస్త్ర చికిత్స శాఖను పెట్టటానికి సామగ్రి అంతా కొన్నాడు. ఆ శాఖకు ప్రారంభోత్సవం చేయటానికి ఆరోగ్యమంత్రిని ఆహ్వానిం చాడు. ఈ పది రోజులలో ఏర్పాట్లు చేసుకుంటూ కాత్యాయనిని చూడటానికి రాలేకపోయాడు. ఉత్సవం రేపనగా ప్రోగ్రాం చెప్పటానికి ఆహ్వానపత్రం పట్టు కుని వచ్చాడు.

ఉమాశంకరం ఫైల్సు చూసుకుంటున్నాడు. కాత్యాయని డాక్టరును చూడ గానే చదువుతున్న పుస్తకం అక్కడ పెట్టి రండి అంటూ కుర్చీ చూపించింది.

''సాయంకాలపువేళ ఆయన ఫైల్సు చూడటం, మీరు పుస్తకం చదవటం. ఈ ప్రోగ్రాము కేమీ భంగం కలగలేదన్నమాట.''

డాక్టరు రుమాలుతో ముఖం తుడుచుకుంటూ ఉంటే కాత్యాయని ఫాను స్విచ్చి నొక్కింది.

''ఈ వేళప్పుడు ఇక్కడ కూర్చుంటే బాగుండదు. లానులో కూర్చుం దాం రండి.'' ఎవరి కుర్చీ వారు తెచ్చుకుని లానులో వేసుకుని కూర్చున్నారు. డాక్టరు గొంతు విని ఉమాశంకరం వచ్చాడు ఒక కుర్చీతో. ఇద్దరికీ చెరొక ఆహ్వాన పత్రం ఇచ్చి ''నాదొక చిన్న కోరిక, రేపటి ప్రోగ్రాములో కాత్యాయని ఫ్లూటు వాయించాలి. ఆరోగ్యమంత్రి వస్తున్నారు. ఈ ఫ్లూటు వాయించటానికి నా కెవరూ దొరకలేదు.''

కాత్యాయని ఉమాశంకరం వంక చూచింది. అతడు తలవంచుకొని డాక్టరు మాటలు వింటున్నాడు. "డాక్టరుగారూ! నా ఆరోగ్యం సంగతి తెలిసుండీ కూడా అడిగితే నే నేం చెప్పను? ఈ సంగీతం వదిలిపెట్టి ఎన్నాళ్లయిందో! అందులో ఫ్లూటు వాయించటానికి దమ్ములేదు." తల వంచుకొని చేతిగోళ్ళు చూసుకుంటూ ఒక్కొక్క మాట మెల్లగా అన్నది.

"మీరున్నారన్న ధైర్యంకొద్దీ నేను ఈ ప్రోగ్రాము పెట్టాను. మంత్రిగారి ముందర నా పరువు నిలపండి. మీ ఆరోగ్యానికి ఏమాత్రం భంగం కలగదు. అన్నిటికీ నేనున్నాను. దీని తరువాతనే మీలో ధైర్యం, ఉత్సాహం కలుగుతాయి. అవి లేకనే మీకింత నీరసం వచ్చింది" డాక్టరు వేడికోలు విని ఉమాశంకరం తలెత్తి కాత్యాయని ముఖం చూశాడు. ఆమె తలవంచుకునే ఉన్నది.

"ఆమెచేత పాట పాడించే బాధ్యత మీదండీ ఉమాశంకరంగారూ! నా మర్యాద దక్కించాలి మీరిద్దరూ." డాక్టరు లేచాడు వెళ్ళటానికి.

ఉమాశంకరం ఆ రోజు ఎక్కువ మాట్లాడలేకపోయినా డాక్టరును కూర్చోబెట్టాడు.

"చెప్పటం మరిచిపోయాను. రేపు ఉదయం పద్మతోసహా నా స్నేహితుడు వస్తున్నాడు. మీచేత పాడించే భారమంతా ఆమె తీసుకుంటుంది. ఈ ఉత్సవంకోసం ప్రత్యేకంగా వాళ్ళిద్దరూ వస్తున్నారు" డాక్టరును గేటువరకూ సాగనంపి ఇద్దరూ వెనక్కు తిరిగారు.

పద్మ సామాను తీసుకుని కాత్యాయని యింట్లో దిగింది. పెరట్లో సపోటా చెట్టు నీడలో కుర్చీలు వేసుకుని కూర్చున్నారు యిద్దరూ. కబుర్లయిన తరువాత గంటసేపు ఘర్షణపడి, బలవంతంచేసి ఫ్లూటు ప్రాక్టీసు చేయించింది పద్మ కాత్యాయనిచేత. ఆ సాయంత్రం ప్రోగ్రాం అయేవరకూ కాత్యాయని వెంటవుండి ధైర్యం చెబుతూనే ఉన్నది.

మూడు శ్లోకాలతో ముచ్చటగా ప్రార్థనచేసింది కాత్యాయని సభారంభంలో. సదా రోగిలా మంచం మీద పడుకుని నిట్టూర్పులు విడిచే కాత్యాయని ఇంత ధైర్యంగా ఇలా పాడుతుందని ఉమాశంకరం అనుకోలేదు. తల వంచుకుని ఆనందిస్తున్నాడు.

స్వాగతోపన్యాసము, ఆరోగ్యమంత్రి ప్రారంభోపన్యాసము, వైద్యశాఖ డైరక్టరు ఉపన్యాసము అయినతరువాత గంటకుపైగా కాత్యాయని ఫ్లూటు వాద్యము. రెండు త్యాగరాజు కృతులు పాడి నవరస కన్నడ రాగములో "నిను వినా నామన సెందు నిలువదే శ్రీహరీ" అందుకున్నది. నిశ్శబ్దవాతావరణంలో ఆ ఫ్లూటువాద్యము దూర తీరాల వరకూ వ్యాపించి జీవరాశినంతనూ మేల్కొలిపింది సభికుల హృదయాలలో రసవాహినులు పొంగులెత్తాయి. కాత్యాయని తన్మయతతో కళ్ళు మూసుకుని వాయింపుతున్నది. ఆ పాట ఎప్పుడు ముగిసిందో సభ్యులు తెలుసుకునే స్థితిలో లేరు. "పవమానాసుతుడు పట్టి" పాట మొదలు కాగానే బాహ్యస్మృతి కలిగిన డాక్టరు కృతజ్ఞతలు చెప్పటానికి లేచాడు.

ఆరోగ్యమంత్రికి డాక్టరు ఏర్పాటు చేసిన విందులో పాల్గొనక తప్పలేదు కాత్యాయనికి. ఉమా శంకరం ఉత్సాహంతో డాక్టరుతోపాటు తిరుగుతున్నాడు. అతడిలో కలిగిన నవచైతన్యము అతడిని బొంగరంలా తిప్పుతున్నది.

అబ్బాయి పేపరుమీద కాత్యాయని డిన్నరు కాగానే యింటికి చేరుకున్నది. అబ్బాయిని జోకొట్టుతూ ఆలోచనలో పడ్డది. భువన మోహనమయిన ఫ్లూటు వాద్యము తరువాత నిదురించిన ఆమె ఉత్సాహము మేల్కొన్నది. చెంగుచెంగున దూకటం మొదలు పెట్టింది. పద్మతో గడిపిన ఆ ఒక్కరోజునే సంసారంలోని నీరసమంతా అడుగున పడినట్లయింది. విద్యార్థినిగా హాస్టల్లో గడిపిన కాలములో మాదిరిగా నూతనోత్సాహంతో కదిలిపోయింది ధ్వని తగ్గించి మీరాబాయి భజన ఒకటి అందుకున్నది.

రాత్రి పదికొండుగంటలు కావచ్చింది. ఆలస్యం కావటంచేత ఉమాశంకరం డాక్టరు కారులో గేటు దగ్గర దిగి గబగబా అడుగులు వేస్తూ వాకిటి మెట్లు ఎక్కుతున్నాడు. ఆ యిల్లంతా మీరాబాయి భజన పాటకు స్తంభించిపోయినట్లయింది. సమ్మోహనాస్త్రతుల్యమయిన ఆ భజన గీతం ఉమాశంకరాన్ని మైమరపించింది. గది ముందర నిలబడి భక్తిపారవశ్యంలో మునిగిపోయాడు.

అడుగుల సవ్వడి కామె తల ఎత్తి చూసింది—పాట ఠక్కున ఆపివేసింది.

"భజన గీతాన్ని ఆపివెయ్యకు కాచీ. ఈ గానంతోనే నాలో వెలుగును ప్రకాశింప చెయ్యి కాచీ—" అమె భుజాలను కుదుపుతూ ఆవేశంతోఅంటున్నాడు.

కాత్యాయని నివ్వెరబోయింది. నోట్లోంచి మాట పెగల్లేదు.

కొంతసేపటికి ఉమాశంకరం కాత్యాయని రెండు చేతులు పట్టుకుని "కాచీ! మన హృదయాలను కలవనీయని అడ్డు తెరలు ఏమయినా ఉంటే చెప్పు తెంచిపేస్తాను" అన్నాడు ఆమె కళ్ళల్లోకి సూటిగా చూస్తూ.

"అడ్డు తెరలా! నా దృష్టి కవి లేనేలేవు" కాత్యాయని అతని ఎదలో తలదాచుకుంటూ నొసటి కుంకుమను అతడి షర్టుకు పులిమి దాన్ని అదేపనిగా చూడటం మొదలుపెట్టింది.

(పుస్తక ప్రపంచం).